

ఫోన్ చేస్తే.. స్పందిస్తా..!

కార్పొరేటర్లకు ఆదాల అభయం - 17మంది హాజరు

మాట్లాడుతున్న ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"ఇప్పటి వరకు జిల్లాలు పద్ధారు. ఇక నుంచి అలా కాదు. ఒక్క ఫోన్ చేయండి.. స్పందిస్తా. ఏ సమస్య అయినా పరిష్కరిస్తా.. ఎవరికీ దేనికి భయపడొద్దు" అంటూ ఎంపి, నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నుంచి తనవైపు వచ్చిన కార్పొరేటర్లతో ఆయన ప్రత్యేకగా భేటీ అయ్యారు.కొంత కాలంలో బోసి పోయిన ఆదాల కార్యాలయం రెండు రోజుల నుంచి కళ కళలాడుతోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అందులో 17 మంది ఆదాల వద్దకు వచ్చారు. నిన్నటి వరకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మా గుండెకాయ అన్న నేతలు సైతం అక్కడ దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ కార్పొరేటర్లు స్వేచ్ఛగా పనిచేయాలని, వారికి సర్వాధికారాలు ఉండేలా చూస్తానన్నారు. రానున్న రెండు రోజుల్లో కార్పొరేటర్లతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తానని, వారు అక్కడే తమ సమస్యలు చెప్పవచ్చునని పేర్కొన్నారు. కార్పొరేటర్లు పార్టీకి మచ్చ తేకుండా పనిచేయాలని కోరారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేస్తానన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డితో మాట్లాడుతానని అన్నారు. రూరల్‌లోని స్థానిక నేతలతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆనం విజయ కుమార్ రెడ్డితో తనకు చాలా కాలంగా సత్సంబంధం ఉన్నాయని, ఆయనతో కలిసి పనిచేస్తానని చెప్పారు. కార్పొరేటర్లు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, అన్ని తమ మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. 20 రోజుల్లో సిఎం జగన్మోహన్ రెడ్డి కి కార్పొరేటర్లను పరిచయం చేస్తామని ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ కోరిక మేరకు ఆయన ఈ విధంగా స్పందించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ అధ్యక్షులు ఆనం విజయకుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు ఎం.గౌరీ, విజయభాస్కర్‌రెడ్డి, రాజేష్‌తోపాటు పాల్గొన్నారు.

'స్రవంతి'కి సంకటక స్థితి..?

వైసిపి తమ బలాన్ని మరింత పటిష్ట పరచుకోవడానికి చూస్తుంది.. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గ్రూపును బలహీనపరచడానికి ఆపార్టీ అధిష్టానం అన్ని ఎత్తులు వేస్తుంది. ఇటీవల నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపికి ఎదిరించి బయటకొచ్చిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో నగర మేయర్ పొట్లూరు స్రవంతి తాను కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితోనే కొనసాగుతానని, మేయర్ పదవి వదులుకోడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న జిఒ ప్రకారం నాలుగేళ్ల అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అవకాశం లేదు. ప్రభుత్వం కొత్త జిఒతో స్రవంతి ఇంటికి పంపే చర్యలు చేస్తారని ప్రచారం సాగుతోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 26 మంది కార్పొరేటర్లలో 17 మంది ఆదాల చెంతకు చేరారు. కోటంరెడ్డికి కేవలం 9 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒకవేళ మేయర్‌గా స్రవంతి కొనసాగినా సంకటక స్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది..

- ○అవిశ్వాసానికి ప్రత్యేక జిఒ యోచన
- ○వైసిపి పాలనలో పటిష్ట జిఒ
- ○మూడేళ్లు ఉండనిస్తారా ..
- ○వైసిపి బలం 45 కార్పొరేటర్లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రాజకీయం రాష్ట్ర రాజకీయాలను గడగడ వణికిస్తున్నాయి. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విషయంలో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం కొంత గందరగోళంలో పడింది. వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డి వైసిపిని దాదాపు వీడినట్లే. పది మంది ఎంఎల్‌ఎల్లో ఇద్దరు ఎంఎల్‌ఎలు వైసిపికి దూరంగా ఉంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో 15 నెలలు సమయం ఉంది. కనీసం ఏడాది పాటు ప్రభుత్వ పాలన సాగుతోంది. నెల్లూరు రూరల్ వైసిపి ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆపార్టీ నియమించింది. ఇదే సమయంలో వైసిపి అధిష్ఠానం నెల్లూరు రూరల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంది. పార్టీ వీడే ఎంఎల్‌ఎలను దెబ్బకొట్టడానికి ఎన్ని అవకాశాలుంటే అన్ని చేస్తుంది. ఇప్పటికే వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామనారాయణరెడ్డికి సెక్యూరిటీ తగ్గించారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు దూరం చేశారు. ఆనం రామనారాయణరెడ్డి మౌనంగా బాధలు భరిస్తున్నారు. ఇటీవల వైసిపి నుంచి బయటకొచ్చిన నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైసిపి అధిష్ఠానంలో సై అంటే సై అంటున్నారు. కోటంరెడ్డికి కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలను దూరం చేసి బలహీన పరచడానికి వైసిపి ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే ముఖ్యనేతలందరికీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన వైపు తిప్పుకున్నారు. మొత్తం నియోజకవర్గంలో 26 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 17 మంది ఆదాల వద్దకు వెళ్లారు. శ్రీధర్‌రెడ్డి వద్ద కేవలం 9 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిని బయటపెట్టి బయటకు తీసుకురాడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏం జరిగినా తాను ఎదుర్కొంటానని శ్రీధర్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. తన బలాన్ని తగ్గించడానికి ముఖ్యమంత్రి కార్యాలయం, ఇన్‌ఛార్జ్ మంత్రులు, మంత్రులు, ఎంఎల్‌ఎలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందరు కార్పొరేటర్లు వెళ్లినా మేయర్ పొట్లూరు స్రవంతి మాత్రం తాను శ్రీధర్‌రెడ్డితోనే ఉంటానని, మేయర్ పదవి తనకు వద్దని చెబుతోంది..

పొట్లూరు స్రవంతి, మేయర్

అవిశ్వాసానికి ప్రత్యేక జిఒ యోచన..!

కార్పొరేషన్‌లో మేయర్ ఎన్నిక జరిగిన తరువాత ఎప్పుడైనా పాలన సరిగా లేకపోయినా, పార్టీ చెప్పిన మాట వినకపోయినా, నేతలకు నచ్చకపోయినా అవిశ్వాస తీర్మానం ఏర్పాటుచేసి తొలగించొచ్చు. ఇది గతంలో ఉన్న జిఒ. నెల్లూరు నగరం కార్పొరేషన్‌గా తొలిసారి పులిమి శైలజ మేయర్‌గా ఎన్నికయ్యారు. కాంగ్రెస పార్టీ అధికారంలోని సమయంలో స్థానిక ఎంఎల్‌ఎ ఆనం వివేకానందరెడ్డి భానుశ్రీని ప్రతిపాదించిన అధిష్ఠానం పులిమి శైలజకు అవకాశం ఇచ్చింది. అటు తరువాత కొద్దిరోజులకే ఆమెపై అవిశ్వాసం పెట్టి తొలగించారు. భానుశ్రీ మేయర్‌గా అవకాశం కల్పించారు. దీనికి మాటికి మేయర్లు మార్పడం మంచిదికాదని అప్పట్లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మేయర్ ఎన్నిక జరిగిన తరువాత నాలుగేళ్ల వరకు పదవి కాలం ముగిసే వరకు అవిశ్వాసం చెల్లదని జిఒ తీసుకొచ్చారు. ఇప్పుడు అదే జరుగుతోంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వైసిపి ప్రభుత్వానికి మేయర్ పొట్లూరు స్రవంతి వ్యతిరేకంగా మారారు. కార్పొరేషన్‌లో మొత్తం 54 డివిజన్లు ఉన్నాయి. ఇందులో 28 డివిజన్లు నగరం, 26 డివిజన్లు రూరల్ నియోజకవర్గంలో ఉన్నాయి. ఈ దఫా నెల్లూరు కార్పొరేషన్ ఎస్‌టి జనరల్‌కు కేటాయించారు. మొత్తం డివిజన్లల్లో మూడు డివిజన్లు ఎస్‌టిలకు కేటాయించారు. అందులో 5వ డివిజన్ రవీంద్ర, 53 డివిజన్ దేవరకొండ సుజాత, 12 డివిజన్ పొట్లూరు స్రవంతి ఎన్నికయ్యారు. కార్పొరేషన్ మొత్తం వైసిపి కైవశం చేసుకుంది. రాజకీయ ఒప్పందాల్లో భాగంగా నెల్లూరు రూరల్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అత్యంత సన్నిహితులు జయవర్ధన్ సతీమణి స్రవంతికి మేయర్ పదవి దక్కింది. ఇది జరిగిన కథ. ఇప్పుడు మేయర్‌కు వ్యతిరేకంగా మొత్తం 45 కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. 9 మంది మేయర్‌కు మద్దతు ఉంది. ఆమెను తొలగించడానికి జిఒ అడ్డుగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక జిఒను తీసుకొచ్చి మేయర్‌కు ఉద్వాసన పలకాలని వైసిపి అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకోసం పావులు కదుపుతున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల కార్యదర్శులు విధుల్లో నిబద్ధత పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సూచించారు. స్థానిక 18/1, 18/2,17/1 సాయి నిలయం వీధి, కావేరి నగర్, వడ్డిపాలెం సచివాలయాలను మంగళవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను కార్యదర్శులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో ఓటుకు ఆధార్ లింక్ చేసే కార్యక్రమాన్ని పటిష్టంగా పూర్తి చేయాలన్నారు. వాలంటీర్ల ద్వారా అర్హులైన అందరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు మంజూరు చేయించాలని సూచించారు. వాలంటీరు పరిధిలోని ప్రజల అనారోగ్యాలకు సంభందించిన వివరాలు, వారికి అందిస్తున్న చికిత్స గురించి ఎప్పటికప్పుడు వివరాలను ఆన్లైన్ లో పొందుపరచాలన్నారు. సిటిజెన్ ఔట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు మరింత చేరువ చేయాలని కోరారు. ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ను విధుల నిర్వహణలో సచివాలయ కార్యదర్శులు తప్పక ధరించాలని కమిషనర్ ఆదేశించారు.

పన్ను వసూళ్లపై దృష్టి

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కుళాయి, డ్రెయిన్, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లకై రెవెన్యూశాఖకు నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని కమిషనర్ హరిత రెవెన్యూ అధికారులకు సూచించారు. నగర పాలక సంస్థ రెవెన్యూ శాఖ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ అధికారులు పన్నుల వసూళ్ళ వేగవంతం చేయాలని, ఇప్పటికీ డిమాండ్ నోటీసులు జారీ చేయని కమర్షియల్ భవనాలను గుర్తించి, వారికి తుది నోటీసు జారీ చేసి, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.సమీక్షలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల అండతో

ఎంఎల్‌సి ఓటర్ జాబితాలో దొంగ ఓట్లు

సబ్ కలెక్టర్‌కు వివరించిన సిపిఎం నాయకులు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల అండదండలతో ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి దొంగ ఓట్లు చేర్చారని సిపిఎం జిల్లా నాయకులు జి వెంకటేశ్వర్లు, జివిబి కుమార్ ఆరోపించారు. కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం శాసన మండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా పై రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. సిపిఎం నాయకులు జి వెంకటేశ్వర్లు, జివిబి కుమార్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టీచర్స్, పట్టభద్రుల ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాలో తెలుగులో ఉన్న పేర్లు తప్పులు తడకగా ఉండటం వల్ల అర్థం కావటం లేదన్నారు. బోగస్ ఓట్లు జాబితాలో కనిపిస్తున్నా యన్నారు. టీచర్ల ఓట్లు లిస్టులో చేర్చామని ఓ మండల రెవెన్యూ అధికారి బల్కుగా ఎంఇఒకు పంపి ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఓ బిఇడి కాలేజీ పేరుతో అనర్హులు టీచర్ల ఓటర్లకు దరఖాస్తులు చేశారన్నారు. లింగసముద్రం మండలంలో విఆర్ఒగా పనిచేసే వ్యక్తి టీచర్ పేరుతో ఓటుకి దరఖాస్తు చేయగా అధికారులు దానిని గుర్తించి తిరస్కరించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. దొంగ ఓట్లను వెంటనే తొలగించకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు లీగల్‌గా పోతామని హెచ్చరించారు. అనర్హుల ఓట్లను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే తొలగిస్తామని సబ్ కలెక్టర్ శోభిక ప్రకటించారు. ఇప్పటివరకు కందుకూరు నియోజకవర్గంలో 12525 పట్టభద్రుల ఓట్లు, 480 టీచర్ ఓట్లు నమోదయి ఉన్నాయని ఆమె చెప్పారు .కందుకూరు తాసిల్దార్ డి సీతారామయ్యతో పాటు సిపియం నాయకులు ఎం జాలయ్య, ఎస్‌కె మున్వర్ సుల్తానా, బిజెపి నాయకులు జె రాఘవయ్య, వైసిపి నాయకులు పరిటాల వీరస్వామి, ఆనుమోలు వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బి సురేష్ బాబు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -కందుకూరు :అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయా పోస్టులకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శోభిక ఇంటర్వ్యూలు నిర్వహించారు. కందుకూరు, కొండేపి, వింజమూరు, ఉలవపాడు, ఉదయగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని ఖాళీ పోస్టులకు సబ్ కలెక్టర్ శోభిక ఆధ్వర్యంలోని ఇంటర్యూ ప్యానెల్ బోర్డు ఇంటర్వ్యూలు నిర్వహించింది. సిడిపిఓలు అంజమ్మ, లావణ్య, మాధవి లత, పద్మజ, విజయ కుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో

'ఆక్స్‌ఫర్డ్' అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి -కందుకూరు :

విద్యార్థులను అభినందిస్తున్న ఉన్నం భాస్కరరావు

జాతీయస్థాయిలో నిర్వహించబడిన జెఇఇ మెయిన్స్ 2023 ఫలితాల్లో స్థానిక బిఆర్ ఆక్స్ఫర్డ్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ ఉన్నం భాస్కరరావు తెలిపారు. ఫలితాలు సాధించిన వారిలో దేసు రాఘవేంద్ర(97), మద్దిసెట్టి భరణి కుమార్(96), గుంటుపల్లి చరణ్(91), వలేటి వర్షిత(90), చెన్నారెడ్డి శార్వన్(90), తన్నీరు రాకేష్(87), ఈదర నవ్యశ్రీ(87), ఉన్నం లోకేష్(85), సోహన దుర్గ(84), మంజు భార్గవి (83), సాయి ధరణి(83), రవితేజ(82), బ్రహ్మేంద్ర(81) పర్సంటైల్ సాధించారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఆ విద్యార్థులను అధ్యాపక బందాన్ని బిఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ బెజవాడ నరేంద్ర బాబు, బాల భాస్కర రావు, ప్రిన్సిపాల్స్ అబ్బూరి వెంకటేశ్వర్లు, షాహల్ హమీద్ అభినందించారు.

వడ్డెరులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి -కందుకూరు :రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వడ్డెరులను ఎస్‌సి జాబితాలో చేర్చే బిల్లుని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం నియోజక వర్గం అధ్యక్షుడు కుంచాల వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1977కి ముందు వడ్డెరలు ఎస్‌సి జాబితాలోనే ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారిని ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

మామిడి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి -ఉలవపాడు :కరేడులోని ఆర్‌బికెలో మామిడి పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు మంగళవారం శిక్షణ జరిగింది. తామర పురుగులు నివారణకు ఫిప్రోనిల్ 1.5ఎంయల్ లీటర్ నీటిని కలిపి ఈ ద్రావణంలో వేపనూనె 3ఎంయల్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఉద్యాన శాఖాధికారి బి. జ్యోతి, ఆర్‌బికె స్టాఫ్ వంశీ కష్ణ, మానస పాల్గొని సూచనలు చేశారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -కందుకూరు : నాయి బ్రాహ్మణులను ఆలయ ధర్మకర్తల మండలలో సభ్యులుగా చేర్చే జిఒ ఇచ్చినందుకు ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు కొమ్మూరి కనకారావు ఆధ్వర్యంలో నాయి బ్రాహ్మణులు వైసిపి కార్యాలయంలో సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం మపాలాభిషేకం నిర్వహించారు. మహీధర్ రెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ అన్ని సామాజికవర్గాల మనోభావాలను గౌరవిస్తున్నారన్నారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు ఆలయ ధర్మకర్తల మండలిలో సభ్యులుగా చేర్చుకోవాలని జిఒ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వైసిపి పట్టణ కన్వీనర్ ఎస్‌కె రఫీ, కందుకూరు నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు జి వేణు, ఏ సుధకర్, పి శ్రీనివాసులు, నాదేళ్ళ శ్రీనివాసురావు, ద్రోణాదుల రమణయ్య, పి ఆజేయ్ కుమార్ పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆక్రమిత భూములు అప్పగించాలి

కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి - సబ్ కలెక్టర్‌కు గిరిజనులు వినతి

తహశీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -కందుకూరు :గిరిజన భూములు ఆక్రమించిన చల్లా మాల్యాద్రి పై చర్య తీసుకోవాలని అతని భారి నుంచి తమను కాపాడాలని, తిరిగి తమ భూములను స్వాధీనం చేయాలని గుడ్లూరు మండలం చినలాటరిపీ గిరిజనులు మంగళవారం కందుకూరులో సబ్ కలెక్టర్ శోభిక, గుడ్లూరు తహశీల్దార్ సీతారామయ్యకి వినతి పత్రం సమర్పించారు. తమ తాత తండ్రుల దగ్గర నుంచి సర్వే నెంబర్ 769లో ఉన్న ప్రభుత్వ భూమిని 5యేకరాలు సాగు చేస్తూ జీవిస్తున్నామని, దీనిని తాము లేని సమయంలో, చల్లా మాల్యాద్రి అనే భూస్వామి ఆక్రమించారన్నారు. తమను బెదిరించి కేసులు పెడుతున్నారని వినతి పత్రం లో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్, సిపిఎం మండల నాయకులు యం జాలయ్య గిరిజనులు కె మాలకొండయ్య, నారా యణమ్మ, అంకమ్మ, సలోమి, వెంకాయమ్మ హైమావతి ఉన్నారు. చినలాటరిపి గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన భూముల మొత్తాన్ని ప్రభుత్వము స్వాధీనం చేసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నెల్లూరు : ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ భవనంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా శాఖ 2023వ సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటస్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని క్యాంలెడర్‌ను ఆవిష్కరించారు. ఎన్‌జిఓ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతినెల ఉద్యోగులకు జీతాలు పడేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ యన్ జీ ఓ రాష్ట్ర అధ్యక్షులు బండి.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డి లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలసి వినతి పత్రం అందజేసి కోరామన్నారు. జిల్లా కోశాధికారి బండారుపల్లి. వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షులు నందిమండలం .ఆంజనేయ వర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు. రామకష్ణ,సంయుక్త కార్యదర్శులు లక్కాకుల .పెంచలయ్య, రాజేంద్రప్రసాద్, జిల్లా మహిళా చైర్ పర్సన్ ఉదయగిరి.చిన్నమ్మ,కన్వీనర్ అరుణ,నగర సంయుక్త కార్యదర్శి షేక్. షంషుద్దీన్ వార్డు సచివాలయం జిల్లా అధ్యక్షులు గంగాధర్ ఉన్నారు.

చెక్కు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు :కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబులిటీ (సిఎస్‌ఆర్) కింద సామాజిక బాధ్యతతో సౌత్ ఇండియా కష్ణ ఆయిల్ అండ్ ఫాక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ యాజ మాన్యం ప్రభుత్వానికి తన వంతు సహాయంగా రూ.14.5 లక్షలు అందజేశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ముత్తు కూరు మండలంలోని పంటపాలెం సమీపంలోని సౌత్ ఇండియా కృష్ణ అయిల్ అండ్ ఫాక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్ యూనిట్ హెడ్ పి.వి.చంద్రమౌళి కలెక్టర్ కెవి చక్రధర్‌బాబు కు చెక్కును అందజేశారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టాన్ని పరిరక్షించుకుందాం..!

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి కేటాయించే నిధుల్లో కోత విధించి ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేయాలని చూస్తోందని, ఈ ప్రయత్నాన్ని తిప్పికొట్టి ఆ చట్టాన్ని పరిరక్షించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ప్రధాన తపాల కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక గ్రామాల్లో కార్మికులకు పని దొరకడం వల్ల ఆహార భద్రత కొరత తీరి పేదలు సమద్ధిగా జీవిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేయాలని చూడటం సరికాదన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కోట్ల మంది ప్రజలకు ఉపయోగపడే ఈ పథకాన్ని నీరుగార్చుతుందన్నారు. అందులో భాగంగా కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ ఏడాది భారీగా కోత విధించిందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, ఆదినారాయణ, నాగేంద్ర, ముక్తియర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఫాతిమా, గౌసియా, హసీనా, విజయమ్మ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మండలంలోని కలవళ్ల, శింగమనేనిపల్లె, శాఖవరం గ్రామాల్లో సాగవుతున్న పంటలను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిణి, మండల ప్రత్యేకాధికారి ఎస్ కనకదుర్గాభవాని మంగళవారం పరిశీలించారు. రబీ సీజన్‌లో సాగవుతున్న శనగ పంట నమోదును పరిశీలించారు. పొలాల ను తనిఖీ చేశారు. ఆయా సర్వేనెం బర్లలో పంట వేశారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి ఎం హేమంత్ భరత్‌కుమార్, వ్యవసాయ సహాయకులు గ్రామ రెవెన్యూ అధికారి పోకూరి నరేద్ర ఉన్నారు.

సిఎం జగన్ వెంటే ప్రజలు : మానుగుంట

ప్రజాశక్తి -ఉలవపాడు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రస్థానం, పాలన నిశ్శబ్ధమైన రాజకీయ విప్లవం అని, ప్రజలు ఆయన వెంటే ఉన్నారని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి తెలిపారు.ఉలవపాడులో జరిగిన సచివాలయ కన్వీనర్లు, గహసారథుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రజా సంకల్ప యాత్ర ప్రజలకు మేలు జరగాలని నడిస్తే లోకేష్ పాదయాత్ర తనకు మేలు జరగాలని చేస్తున్నారని విమర్శించారు.కరోనా సమయం లోనూ ప్రకటించిన ప్రతి పథకాన్ని ప్రజలకు అందించినవ్యక్తి జగన్ అన్నారు. ప్రజలకు మేలు చేశాను అంటేనే ఓటు వేయండి.. లేకుంటే ఆడగను అని చెప్పిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి గహసారధులు సంపూర్ణంగా పనిచేయాలన్నారు. తాను టిడిపిలో చేరతానన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వైసిపిలోనే ఉంటానన్నారు. కందుకూర్ డివిజన్ డెవలప్మెంట్ అధికారి డి ఎల్ డి వో పి పద్మజ, ఉలవపాడు మండలం భీమవరం 1, భీమవరం 2 సచివాలయములు సందర్శించి సచివాలయ ఉద్యోగుల రికార్డ్సను పరిశీలించడమైనది రికార్డ్ పరిశీలించటలో పలు సూచనలు ఆదేశాలు జారీ చేయడమైనది. మండల పరిషత్ అభివద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, యంపిడిఓ చెంచమ్మ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి

పారిశ్రామిక రంగం వైపు

యువత దృష్టి సారించాలి

ప్రజాశక్తి-నెల్లూరు :యువత పారిశ్రామిక రంగం వైపు దృష్టిసారించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ యువత నిరాశ నిస్పృహలకు లోను కాకుండా ఉద్యోగాలపై ఆశపడకుండా స్వయం ఉపాధి రంగంలో ముందుకు పోవాలని కోరారు. ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. సెట్నల్ సీఈవో పుల్లయ్య ప్రముఖ మోటివేటర్ నర్సింహారెడ్డి యువతకు నాయకత్వ లక్షణాలను సవివరంగా వివరించారు. నెహ్రూ యువకేంద్రం జిల్లా కోఆర్డినేటర్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే కార్యక్రమాల్లో యువకులు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు ఒకటో పొగాకు వేలం కేంద్రం పరిధిలోని ఆదర్శ గ్రామం ఉప్పలదిన్నెలో ప్రస్తుతం జరుగుతున్న పంట కాలానికి సంబంధించి ఉత్పత్తి, క్యూరింగు, బేల్లుకట్టటం విషయాల మీద రైతులకు సలహాలు సూచనలు, సందేహ నివత్తిలో సిటిఆర్‌ఐ, ఐటిసి, జిపిఐ, పిఎస్ఎస్ సంస్థలకు సంబంధించిన శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞుల సమక్షంలో రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. వేలం నిర్వహణాధికారి చైన్ రామ్ మీనా మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు ఉత్పత్తి పై రోజు రోజుకు ఆంక్షలు పెరుగుతున్న నేపథ్యంలో పొగాకు పంటను నమ్ముకున్న రైతులు అభ్యున్నతికి పాటించవలసిన మార్గదర్శకాలు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పొగాకు అనగా అన్యపదార్థాలు లేని, క్రిమిసంహార మందులు లేని పొగాకును ఉత్పత్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి చైన్ రామ్ మీనా, సిటిఆర్ఐ సైంటిస్ట్ ఎం అనురాధ, ఐటిసి మేనేజర్ వై సునీల్ కుమార్, పిఎస్ఎస్ మేనేజర్ ఏ రామాంజనేయులు, జిపిఐ మేనేజర్ యు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాలు విరాళం

ప్రజాశక్తి -గుడ్లూరు : స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రం ఆవరణంలో నిర్మిస్తున్న సమావేశం హాలు నిర్మాణానికి రూ. 25 వేల విలువైన 70 సిమెంట్ బస్తాలను దాత విరాళంగా అందజేసినట్లు వైద్యాధికారి డాక్టర్ మారుతిరావు మంగళవారం తెలిపారు. మండల ంలోని పూరేటిపల్లికి చెందిన గనిపినేని నరసింహం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణిపినేని వెంకటేశ్వర్లు 70 సిమెంట్ బస్తాలను విరాళంగా అందజేశారు. దాతల సహకారంతో సమావేశపు హాలును వైద్య ఆరోగ్య కేంద్రంలో నిర్మిస్తున్నారు.

పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పరిష్కరించుకో దగ్గ కేసుల్లో రాజీ పడదగ్గ కేసులపై ప్రత్యేక దష్టి సారిస్తున్నట్లు కష్ణపట్నం సిఐ కె. వేమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అయన తోటపల్లిగూడూరు పోలీస్టేషన్‌ను తనిఖీ చేశారు. సందర్భంగా అయన ఎస్ఐ కె. ఇంద్రసేనారెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. సామరస్యంగా పరిష్కరించుకో దగ్గ కేసులలో రాజీ పడదగ్గ క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ తగాదా కే సులు, మోటార్ వెహికల్ యా క్సిడెంట్, చిట్ ఫండ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ ఇతర కేసు లను పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్విని యోగంచేసుకోవాలని వేమారెడ్డి సూచించారు.

పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు పెంపు

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పొదుపు పథకాలపై పెంచిన వడ్డీ రేట్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ ఎస్. రామకష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9,10 తేదిలల్లో నెల్లూరు డివిజన్ లో అన్ని తపాలా కార్యాలయాలలో సుకన్య సమద్ధి పేరిట అవగాహన మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సుకన్య ఖాతాలు తెరవటం వలన ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. సుకన్య ఖాతాలు తెరవని 10 సంవత్సరముల' లోపు వయస్సుగల ఆడపిల్లల తల్లితండ్రులు వెంటనే సుకన్య ఖాతాలు దగ్గరలో ఉన్న తపాలా కార్యాలయాల్లో ప్రారంభించాలని పిలుపు నిచ్చారు.

ఆశా కార్యకర్తలతో సమావేశం

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా మొదటి మంగళవారం జరిగే ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం మంగళవారం పిహెచ్‌సి రాజశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ఆరోగ్య కేంద్ర పరిధిలో దాదాపుగా 30 మంది ఆశా కార్యకర్తలు ఉన్నారని ఆయన తెలిపారు. ఆశా కార్యకర్తలు చేయాల్సిన కార్యక్రమాలను వివరించి ప్రతి గ్రామంలో ఆశా కార్యకర్త గర్భిణీలను గుర్తించి మూడు నెలల్లోపు వారిని గుర్తించి ఎఎన్ఎంకు ఆ సమాచారాన్ని అందించాలని తెలిపారు. డ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని పరిసరాల పరిశుభ్రతను పాటించే విధంగా స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. పిహెచ్‌సి సుశీలమ్మ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కరిష్మా పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రతినెలా మొదటి మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశాన్ని డాక్టర్ జి.వెంకటప్రసాద్, ప్రోగ్రామ్ అధికారి ఆత్మకూరు, వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమావేశంలో ఆశా కార్యకర్తలకు 12 వారాల లోపు గర్భిణులను గుర్తించాలని తెలిపారు. స్పర్శ కార్యక్రమం లెప్రసీ గురించి అవగాహనా కార్యక్రమాలను జరిపి ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే గుర్తించి పిహెచ్‌సికి పంపాలని తెలిపారు. సమావేశంలో డాక్టర్ పి.సాయికృష్ణచైతన్య, డాక్టర్ బి.జ్యోతి రాణి, ఎస్‌.కె.షంషుద్దీన్, సిని ఎస్‌.కె.షఫీ, హెచ్‌ఇఒ వి.జ్యోతి, పిహెచ్‌ఎన్ వి.సలోమి, హెచ్‌వి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

ఉచితంగా ఆపరేషన్

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో మేరకు కావలి పట్టణం ఆనంద్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో శ్రావణి అనే నిండు గర్భిణికి ఉచితంగా ఆపరేషన్ చేసి, తల్లి బిడ్డను క్షేమంగా ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ కావలి పట్టణం బాపూజీ నగర్ నివాసిత్రైన శ్రావణికి కాన్పు నిమిత్తం ప్రయివేటు హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకునేంత శక్తి లేదని, తమ సంస్థ ద్వారా ఆపరేషన్ చేయించి ఆదుకోవాలని కోరినవెంటనే డాక్టర్ ఆనంద్ కుమార్‌కు డాక్టర్ మాధవిలతకు తెలియజేశామన్నారు. స్పందించిన వారు "కానూరు రమాదేవి చారిటబుల్ ట్రస్ట్" ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేసి మంగళవారం తల్లి బిడ్డను క్షేమంగా ఇంటికి పంపించినట్లు తెలిపారు.

9న టిడిపి మండల సమావేశం

ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి మండల సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని మండల అధ్యక్షులు చింతలచెరువు బయన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక చెంచల బాబుయాదవ్ అతిథిగృహంలో ఈ సమావేశం మండల అధ్యక్షుల అధ్యక్షతన జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొల్లినేని వెంకట రామారావు, మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడిపి చైర్మన్ పి.చెంచల బాబు యాదవ్, పట్టభద్రులు తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులు టిఎన్‌టియుసి, తెలుగు యువత టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల వివరాలు నమోదు

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ సూచనల మేరకు విద్యార్థుల వివరాలను బుధవారం సాయంత్రంలోపు చైల్డ్ ఇన్ఫో నమోదు ప్రక్రియ వేగవంతంలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాల లోపు విద్యనభ్యసిస్తున్న ప్రీ ప్రైమరీ (నర్సరీ, ఎల్ కె జీ, యుకెజీ) విద్యార్థుల భౌతిక వివరాలను వేగవంతం చేశారు. హోలీ ఏంజెల్స్, సెయింట్ మేరీస్, గౌతమి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను జిల్లా ఉన్నత పాఠశాల కృష్ణంపల్లి ప్రధానోపాధ్యాయులు కె.శివరామిరెడ్డి, సిఆర్‌పి సిద్ధయ్య, సాధన రెడీస్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను గండిపాలెం ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేశ్వర్లు, సిఆర్‌పి ఖాదర్ మొహిద్దీన్, శ్రీవిద్యాదేవరాయ ఇన్‌స్పైర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలను గడ్డంవారిపల్లి ప్రధానోపాధ్యాయులు ఎస్ శీనయ్య సిఆర్‌పి శ్రీనివాసులు సందర్శించి చదవే ప్రైమరీ విద్యార్థుల వివరాలను హాజరు పట్టీల భౌతికంగా పరిశీలించారు. ప్రయివేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని గిరిజనులు

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలే మండలం ఎస్‌పిపాలెంలోని గిరిజన కుటుంబాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయని కాంగ్రెస్ సతీష్ నాయుడు యువ నేస్తం సభ్యులు గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి పేర్కొన్నారు. మంగళవారం గిరిజన కుటుంబాలను కలిసి వారి సమస్యలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజనులు గత 40 సంవత్సరాలుగా తాగడానికి మంచి నీళ్లు లేక పక్కా ఇళ్లు మంజూరు కాకపోవడంతో ఆ విషయాన్ని కాంగ్రెస్ సతీష్ నాయుడు దృష్టికి తీసుకొని పోగా వారు స్పందించి యూనాడులు హ్యాండ్‌బోరు వేయించి దాహార్తిని తీరుస్తానని హామీనివ్వడంతో వారికి గిరిజన కుటుంబాలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో భవాని ఎడ్యుకేషన్ సొసైటీ సంస్థ అధ్యక్షులు డాక్టర్ కట్టెపల్లి సింహాద్రి రావు, అక్షయ ఉమెన్ సేవా సంస్థ అధ్యక్షురాలు గోపాల బాల శైలజ, కాంగ్రెస్ యువ నేస్తం సభ్యులు పీట్ల ప్రత్యూష్ కుమార్, జయంపు కనకయ్య, స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో మానవత కార్యక్రమాల నిర్వహణ సంస్థ హ్యూమన్ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్. ఫనీభాషా ఆధ్వర్యంలో విశ్రాంత ఉపతహశీల్దార్, హ్యూమన్ సేవ సంస్థ గౌరవసలహా దారులు, మొఘల్ శిరాజ్ బేగ్, కుమార్తె మొఘల్ సమీరా, అల్లుడు రఘువర్, చెన్నై నివాసుల దాతృత్వంతో విద్యార్థినులకు నిత్యావసర సరుకుల సంచితో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా మాట్లాడుతూ హ్యూమన్ సేవాసంస్థ ద్వారా చాలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫనిభాషాను, సంస్థ సభ్యులందరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో హ్యూమన్ సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్.ఫనీభాషా, గౌరవ అధ్యక్షులు షేక్.ఖాదర్ బాషా, గౌరవ సలహాదారులు మొగల్.సిరాజ్‌బేగ్, విశ్రాంత ఆధ్యాపకులు ఎం.వి.ఎస్.ప్రసాదరావు, విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ రమణయ్య, చేపూరి ప్రభువ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో గ్రామసభ

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని లక్ష్మీపురం సచివాలయంలో జల జీవన్ మిషన్‌కు సంబంధించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి కొండమ్మ మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యం ద్వారా గ్రామాన్ని త్వరగా అభివృద్ధి చేసుకోవచ్చని, ప్రతి ఒక్కరూ పంచాయతీ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జల జీవన్ మిషన్ ద్వారా 2024 నాటికి ప్రతి ఇంటికి కొళాయి ద్వారా తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన జల జీవన్ మిషన్ ఆశయాలు ఉద్దేశమన్నారు. ఈ గ్రామంలో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్లు ఉన్నాయని, స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మల్లు రియాజ్‌బేగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మనసుర్‌అహ్మద్, జల జీవన్ జిల్లా సలహాదారు శర్మ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరం సచివాలయంలో వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి కె.రామకృష్ణ ఇంటింటి క్యాంపెయిన్ పథకానికి సంబంధించిన సూచనలు, దాని విధి విధానాలను చక్కగా వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌చరణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ సిహెచ్. శాంతి కుమారి, డిజిటల్ అసిస్టెంట్ ఆర్.నరేంద్ర, మహిళ సంరక్షణ కార్యదర్శి ఎం.రేవతి, వెటర్నరీ అసిస్టెంట్ జి.కాజాప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.మానస పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ నార్త్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ 93వ వార్షికోత్సవ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు కావలి జో బాయ్స్ సెంట్రల్ తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రసంగీకులు కె.మూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి ప్రసంగీకులు కె.నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో టి.దేవదానం, కొడవలి సభ్యులు మనోహర్, చంద్రహాస్, ధనరాజ్, నిర్మల్, సుందర్‌కుమార్, స్టీఫెన్‌రాజ్, పాల్గొన్నారు.

సిబిఎ, ఎఫ్‌ఎ -3 పరీక్షలు నిర్వహణ

ప్రజాశక్తి-ఉదయగిరి/సీతారామపురం : ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో 1 నుండి 8 తరగతుల విద్యార్థులకు సిబిఎ - 2 పరీక్షలు, 9,10 తరగతి విద్యార్థులకు ఎఫ్‌ఎ-3 పరీక్షలను మంగళవారం ఎంఇఒ షేక్ మస్తాన్‌వలీ నిర్వహించినట్లుగా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 1 నుండి 5వ తరగతి వరకు ప్రశ్నపత్రాలను ఏ రోజుకారోజు ఆయా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల నుండి ప్రధానోపాధ్యాయులు తీసుకుని వెళ్లాలన్నారు. అలాగే 6 నుండి 10 వరకు ప్రశ్నపత్రాలను ఏ రోజుకారోజు మండల విద్యాశాఖ కార్యాలయం నుండి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకుని వెళ్లాలన్నారు. సిబిఎ పరీక్షలకు జవాబులు ఒఎంఆర్‌లో విద్యార్థులు భర్తీ చేసి పరీక్షలు ముగిసిన మరుసటి రోజున జవాబు పత్రాలను ఆయా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయాలన్నారు.

పలుచోట్ల 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

కావలిలో...

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణ 38వ వార్డులో మంగళవారం టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రజలకు తినుబండారాలు పంచుతూ వారితో మాట్లాడుతూ సమస్యలపై దృష్టి సారించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ వైసిపి పరిపాలనపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి లోకేష్‌కు తమ సమస్యలు చెప్పుకుంటున్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాదయాత్రకు సంఘీభావంగా ఆయనవెంట నడుస్తున్నారన్నారు. ఈ వార్డులోనే కాక కావలి మున్సి పాలిటీలో ఉన్న సమస్యలపై మున్సిపల్ అధికారులు ఎటువంటి కార్యక్రమాలను చేపట్టిన దాఖలాలు లేవని మండిపడ్డారు. కనీసం ఫోన్ చేస్తే స్పందించే స్థితిలో మున్సిపల్ అధికారులు లేకపోవడం శోచనీయమన్నారు. వైసిపి నాయకులు నోరు అదుపులో ఉంచుకొని మాట్లాడాలని హితవుపలికారు. కేవలం అరకొర సంక్షేమ పథకాలపైనే జగన్మోహన్‌రెడ్డి దృష్టి పెట్టి, అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టారని విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో పరిపాలన బాగా ఉండేదన్న అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. ఈసారి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేయకూడదని ప్రజలు నిశ్చయించుకున్నారని, రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, యూనిట్ ఇన్‌చార్జ్ వేటూరి శివ, వార్డు అధ్యక్షులు బెజవాడ రవీంద్ర, రాష్ట్ర టిఎన్‌ఎస్‌ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల శివకుమార్, జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు మల్లి రమణయ్య, 31వ వార్డు ఇన్‌చార్జ్ మంచాల ప్రసాద్, నెల్లూరు పార్లమెంటు యువత అధికార ప్రతినిధి జంపాని వంశీగౌడ్, బెజవాడ మనోజ్, కత్తి ఆదిశేషయ్య, చేజర్ల ఇబ్రహీం, కరసాల భాస్కర్ నాయుడు, ఇంటూరి భాస్కర్ నాయుడు, ఘట్టమనేని మనోహర్, గోగినేని సుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీరామ్ నగర్‌లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని శ్రీరాంనగర్ కాలనీ, మూర్తిరాజుపురం గిరిజన కాలనీలో మంగళవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అంటూ ఆ పార్టీ శ్రేణులు ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్, బండి శ్రీనివాసులురెడ్డి, అరగల రమణయ్య మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు విసుకు చెందుపోయారని ఎద్దేవా చేశారు. మద్యం రేట్లు అధికంగా పెంచి క్వార్టర్ బాటిళ్లలో స్పిరిట్ నింపి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారి కూలి పనులకు వెళ్లి ఎంతో శ్రమించి మద్యం కొనబోతే అధిక ధరల కారణంగా ప్రజలు బెంబేలెత్తుతున్నారని తెలియజేశారు. 20 రూపాయల మద్యాన్ని రూ.200లకు అమ్ముతూ అంతా దోచుకుంటున్నారని దుయ్యబట్టారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి నేతలు రైతులకు చేసిన మేలేమిటో తెలియజేయాలని కోరారు. పండించిన ధాన్యానికి మద్దతు ధర లేక రైతులు విలవిలలాడిపోయారని గుర్తు చేశారు. ఈ కాలనీలో ఆలయాలు, బడులు, సిమెంట్ రోడ్లు, తాగునీటి వసతి, పక్కా ఇళ్లు టిడిపి హయాంలో ఏర్పాటు చేశామని వారన్నారు. జగన్మోహన్ రెడ్డి చెప్పే కల్లబొల్లి హామీలు ఎవరూ నమ్మరని వివరించారు. సంక్షేమం గాడు తప్పి పరిపాలన కుంటు పడిందని ప్రతిఒక్కరూ ఆలోచించి టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బుల్లా కృష్ణారెడ్డి, ఆశ్రిత్ రెడ్డి, కత్తుల శ్రీకాంత్, చంతాటి రాజశేఖర్ బాబు, కావలి జగన్మోహన్ రావు, షేక్ నజీర్‌బాషా తదితరులున్నారు.

అల్లూరులో...

సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-దగదర్తి

మండలంలోని నూతనంగా ఏర్పాటు చేసిన జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో ఇటీవల దళితులపై జరిగే దాడులు నిరసనగా బుధవారం చేపట్టనున్న సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం, కెవిపిఎస్ నాయకులు కోరారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్ రఘురామయ్య, జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు పాల్గొంటారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం కర్ర పోలయ్య అధ్యక్షతన జరుగుతుందన్నారు.

ప్రవేశం గడువు పొడిగింపు

ప్రజాశక్తి-మర్రిపాడు

కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలియజేశారు. పూర్తి చేసిన దరఖాస్తులను పంపడానికి ఫిబ్రవరి 15వరకు పొడిగించగా పరీక్షలు ఏప్రిల్ 29న జరుగుతాయన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చున్నారు. ఇతర సమాచారం కోసం 8985007588, 9490377829 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

విఆర్‌ఒలతో తహశీల్దారు సమీక్ష

ప్రజాశక్తి-వరికుంటపాడు

స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ అబ్దుల్ హమీద్ విఆర్‌ఒలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉదయగిరి నియోజకవర్గం ఎలక్షన్ డ్వామా పిడి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. వరికుంటపాడు మండలంలో ఓటర్లు ఆధారు అనుసంధాన కార్యక్రమం 61 శాతం మాత్రమే పూర్తయిందని మండలంలో జిల్లాలలో సీడింగ్ల వెనుకబడి ఉందని గ్రామ బిఎల్‌ఒలతో కలిసి విఆర్‌ఒలు ఓటర్ ఆధార్ అనుసంధానం కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలని సూచించారు. ముఖ్యంగా కాన్చెరువు సచివాలయం నుండి పంచాయతీ కార్యదర్శి కేవలం 22 శాతమే పూర్తి చేశారని అతని నుండి తగిన సహకారం లేదని ఈ సందర్భంగా డ్వామా పిడికి తహశీల్దార్ ఫిర్యాదు చేశారు. అందుకాయన వరికుంటపాడు ఎంపిడిఒకు సమాచారం అందిచాలని అతనిపై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు కొండయ్య, ప్రసాదు, చెన్నకేశవులు, అంథోని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు

బాధితులకు పోలీసులు రక్షణ

ప్రజాశక్తి-కావలి

సముద్రంలో పడవలో పోతూ ప్రమాదంలో చిక్కుకుని పోలీసుల సహాయంతో 9మంది బాధితులు రక్షించబడిన సంఘటన మంగళవారం కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం తీర ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మధ్యాహ్నం 3 గంటలకు 112 నెంబర్‌కు బాధితులు తమ ఫోన్ ద్వారా తాము ప్రమాదంలో ఉన్నామని, తమను రక్షించమని అభ్యర్థించారు. ఈ ఫోన్ కాల్‌ను అందుకున్న కావలి రూరల్ సిఐ రాజేష్, ఎస్‌ఐలు, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలాన్ని చేరుకున్నారు. సముద్రంలో మునుగుతున్న పడవలోని 9మంది వ్యక్తులను కాపాడారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు కావలి, ముసునూరు గ్రామాలకు చెందిన 9మంది వ్యక్తులు చెన్నాయపాలెం పెద్దపట్టపుపాలెం తీరం నుండి వేటకోసం సరదాగా ఒక పడవలో సముద్రంలోకి వెళ్లారు. పడవ నడిపే వ్యక్తి తప్ప తాగి, పడవలో పడి పోయాడు. నడిపే వ్యక్తి లేకపోవడంతో పడవ నీటిలో మునిగింది. వెంటనే బాధితులు ఫోన్ ద్వారా పోలీస్ సహాయం కోసం అభ్యర్థించారు. పోలీసులు రక్షించిన వారిని కందుకూరి సాయి, సంగదారపు హరి, బెల్లంకొండ వెంకటేష్, బైనబోయిన మధు, అదేపల్ల సుబ్రహ్మణ్యం, ఏపూరి తేజ, గోళ్ళ రాజశేఖర్, చెన్నుబోయిన మనోహర్, రాచూరి శ్రీనులు సురక్షితంగా బయట పడ్డారు. తమను రక్షించిన పోలీసులకు బాధితుల కుటుంబాల వారు ధన్యవాదాలు తెలియజేశారు.

పోలీసులు రక్షించిన ప్రమాద బాధితులు

పొగాకు గ్రేడింగ్‌లో పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని గుండెమడకల, భైరవరం, డిసిపల్లిలోని పొగాకు పంటను, పొగాకు ఆకు రెలుపులను క్యూరింగ్, గ్రేడింగ్‌ను పొగాకు మంగళవారం బోర్డు ఇన్‌ఛార్జి సెక్రటరీ వేణుగోపాల్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు రైతులు సంక్షేమం కోసం పొగాకు బోర్డు తీసుకుంటున్న చర్యలను వివరించారు. తుఫాను ప్రభావంతో పొగాకు పంట దెబ్బతిన్న రైతులకు వడ్డీలేని రుణం కింద రూ.10వేలు ప్రతి రైతుకు ఇవ్వొచ్చన్నారు. పొగాకు పంట ఇన్సూరెన్స్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీలతో సంప్రదింపులు జరుగుతున్నాయని, వేలం కేంద్రంలో వేలాన్ని మార్చి 9న ప్రారంభించనున్నట్లు తెలిపారు. బోర్డు ఆక్షన్ మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ పొగాకు పంట ప్రతి వేలం కేంద్రంలో గత ఏడాది కన్నా చాలా ఎక్కువ పెరిగిందని, రైతులందరూ పొగాకును తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడి తీసేవిధంగా పండించాలని, అలాగే పొగాకు బోర్డు, సిటిఆర్‌ఐ సూచనలను అనుసరించి అధిక నాణ్యత గల పొగాకును పండించాలని తెలిపారు. లైసెన్స్ రెన్యువల్‌ను 28వతేదీ లోపు చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారులు జి.రాజశేఖర్, సిద్ధిరాజు, రైతు సంఘం నాయకులు, రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకును పరిశీలిస్తున్న అధికారులు

గణితంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-సీతారామపురం

విద్యార్థులు గణితంపై పట్టు సాధించి సులభరీతిలో బోధన నేర్చుకునేలా మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్ బృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరు నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు గణిత మెలకువలు తెలుసుకుంటే గణితాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చన్నారు. సర్వ శిక్ష అభియాన్ బృందం సభ్యులు తమ పాఠశాలలోని విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా గణిత మెలకువలను నేర్పడం ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

గృహ సారథులకు శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురు మోహన్‌తో కలసి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు సమన్వయం చేసుకుని పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ పథకంలోనూ అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన ప్రతి కుటుంబం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంట ఉంటామని చెబుతున్నారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థలు దేశ వ్యాప్తంగా ప్రసంశలు పొందాయని తెలిపారు. సమిష్టిగా అందరం కలిసికట్టుగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన విధులు, బాధ్యతలను నెరవేర్చాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సింగసాని గురుమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందనివారికి తోడుగా ప్రస్తుతం ఒక వాలంటీర్‌కు ఏర్పాటు చేసిన ఇద్దరు గృహ సారథులు వైసిపి అందజేస్తున్న సంక్షేమ పథకాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గృహసారథులకు అందజేసే కిట్‌ను, దాని ద్వారా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు నిర్వహించాల్సిన విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచ్ లు ఎంపీటీసీ లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

విద్యతోనే గిరిజనుల అభివృద్ధి

ప్రజాశక్తి-కావలి

గిరిజనుల అభివృద్ధికి విద్య ఒక్కటే మార్గమని కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. మంగళవారం ఎపి ఎరుకుల గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య ఆధ్వర్యంలో 6వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు సుబ్బానాయుడును శాలువాలతో సత్కరించారు. సభను ఉద్దేశించి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఒకనాడు నందమూరి తారక రామారావుని గెలిపించిన ఘనత గిరిజనులకే దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీకి గిరిజనులు వెన్నెముకలా ఉంటారని తెలిపారు. గిరిజనులు అభివృద్ధి చెందాలంటే విద్యే మార్గమని సూచించారు. తమ పిల్లలు చదువుకునేలా ప్రతి గిరిజన కుటుంబ పెద్దలు అనుకుంటే మార్పు త్వరితగతిన వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పోలా వెంకటరమణ, జిల్లా అధ్యక్షులు బోగిరి ప్రభాకర్, జిల్లా రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, కడప జిల్లా పార్లమెంట్ ఎస్‌టిసెల్ అధ్యక్షులు రవి కుమార్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి బొగ్గవరపు శ్రీనివాసరావు, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు కేకగుంట్ల నరసింహులు, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దావులూరి దేవ, కర్నూలు జిల్లా సంఘం అధ్యక్షులు చురచుర నరసింహులు, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు శీను, నంద్యాల జిల్లా అధ్యక్షులు మానుపాటి శేషు, కడప జిల్లా అధ్యక్షులు రవికుమార్, తదితరులున్నారు.

సుబ్బానాయుడుతో మాట్లాడుతున్న మహిళ

పొగాకు బ్యార్నీ యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి-ఉదయగిరి

నియోజకవర్గ పరిధిలోని పొగాకు బ్యార్నీ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు రేంజ్ అధికారి టి.ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అక్రమంగా రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించి జమాయిల్ చెట్ల నరికి కలపతో ఉన్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. దుత్తలూరు మండలం బోటికర్లపాడు వనసంరక్షణ సమితి దుత్తలూరు రిసర్వ్ ఫారెస్ట్‌లో పెంచబడిన జమాయిల్ 2006- 2007 సంవత్సరం తోటలోకి జంగాలపల్లి గ్రామంలోని పొగాకు బ్యార్నీలకు చెందిన కొందరు, ఈ అక్రమాలకు పాల్పడుతూ జమాయిల్ చెట్లను నరికి, ట్రాక్టరుకు లోడ్ చేసి, రవాణా చేస్తుండగా దుత్తలూరు సెక్షన్, బీట్ అధికార్లు పట్టుకుని, కేస్ నమోదు చేసి ట్రాక్టర్‌ను ఉదయగిరి అటవీ రేంజ్ అధికారి కార్యాలయానికి తరలించారన్నారు. అనంతరం రేంజ్ పరిధిలోని 5 మండలాల పొగాకు బ్యార్నీ యజమానులకు బ్యార్నీలు నడపడానికి వినియోగించే కలప కోసం ఎవరు కూడా అడవులలోకి ప్రవేశించి, చెట్లు నరకరాదని బ్యారెన్‌ల కోసం కర్రతుమ్మ తప్ప ఇతర జాతులు చింత, వేప, దిరిసనం అనుమతి లేకుండా వినియోగించ రాదన్నారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే బ్యార్నీ లైసెన్స్ రద్దు కోసం పొగాకు బోర్డుకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కృష్ణచైతన్య విజయదుందుభి

ప్రజాశక్తి-నెల్లూరు

జనవరి 2023లో జరిగిన జేఈఈ మెయిన్స్ ఫలితాలను ఎన్‌టిఎ విడుదల చేసింది. ఈ ఫలితాల్లో కృష్ణ చైతన్య ఐ.ఐ.టి, కృష్ణ చైతన్య అకాడమీ ప్రోగ్రాం నందుక్యాంపస్ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. విద్యార్థిని విద్యార్థులను కృష్ణ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఆర్ వి కృష్ణారెడ్డి, పి చంద్రశేఖర్ రెడ్డి అరుణించారు. కృష్ణ చైతన్య కళాశాలలు ఆకాష్ న్యూఢిల్లీ వారితో కలిసి ఐ.ఐ.టీ - జే. ఇ.ఇ, నీట్ ఇంటిగ్రేడ్ ప్రోగ్రాంను విద్యార్థులకు అందిస్తున్నామని డైరెక్టర్లు తెలియజేశారు. కార్యక్రమంలో కృష్ణ చైతన్య జూనియర్ కళాశాల డీన్ శిరీష్ బాబు, అకాడమిక్ డీన్ రాంగోపాల్ రెడ్డి, అడ్మిన్ డీన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని బూదవాడ గ్రామంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నూతన గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందలేదని జగనన్న ప్రభుత్వంలో అర్హులను వెతికి లబ్ధి చేకూర్చుతోందన్నారు. ప్రజలు తమ సమస్యల పరిస్కారం కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా సచివాలయాలను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుబ్బిరెడ్డి మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, వైసిపి నాయకులు సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ హరిబాబు, వైస్ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, నాయకులు రామ్మోహన్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి, శివ, రెవెన్యూ అధికారులు, ఇఒపిఆర్‌డి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కలిగిరి

మహారాష్ట్రలోని షిర్డీలో ఫిబ్రవరి 2 నుండి 5వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలలో కలిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పతకాలను కైవసం చేసుకుని కలిగిరి క్రీడారంగాన్ని నలువైపులా విస్తరింపజేశారు. క్రీడా ఆణిముత్యాలు వి శ్రావణి, ఎస్ కె సోని, యం భార్గవ్‌రామ్‌లు ఈ పోటీలలో పాల్గొని జాతీయ, రాష్ట్ర స్థాయిలలో రాణించారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను పాఠశాలలో జరిగిన ప్రధానోపాధ్యాయులు భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు వీరరాఘవులు, సిబ్బంది అభినందించారు.

వెటరన్ క్రీడాకారిణికి సత్కారం

ప్రజాశక్తి-కావలి

ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 5వ అఖిల భారత మాస్టర్స్ క్రీడాపోటిలలో పలు పతకాలు సాధించిన ఆర్‌టిసి ఉద్యోగి సతీమణి పద్మావతిరవిప్రకాష్‌ను మంగళవారం ఎపిఎస్ ఆర్‌టిసి, కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ తమ ఆర్‌టిసి ఉద్యోగి రవిప్రకాష్ సతీమణి పద్మావతి వెటరన్ క్రీడలలో రాణించడం అభినందనీయమన్నారు. అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కె.వి.ఆర్. బాబు మాట్లాడుతూ తమ సంస్థ ఉద్యోగి భార్య పద్మావతి ఇటీవల జరిగిన మాస్టర్స్ క్రీడలలో రాణించి 5బంగారు పతకాలతో సహా మొత్తం 7పతకాలు సాధించ డం తమకెంతో గర్వకారణమని అన్నారు. పద్మావతి మాట్లాడుతూ ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారిణి, విశ్రాంత వ్యాయమ అధ్యాపకురాలు వై.కోటేశ్వరమ్మ శిక్షణ, ప్రోత్సాహంతో నాసిక్, బెంగుళూరు, వారణాసి, తిరువనంతపురం తదితర నగరాలలో జరిగిన క్రీడాపోటీలలో పాల్గొని పతకాలు సాధించానని తెలిపారురు. కుటుంబసభ్యుల సహకారం, రెడ్‌క్రాస్ మహిళా విభాగం సభ్యులు ఎం.పార్వతి శంకర్, జమున, మధురంతకం నళిని, డాక్టర్ విజయమ్మ, డాక్టర్ నళినిపద్మ తదితరుల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది ఎస్‌కె.మస్తాన్, బి.శ్రీను, రక్తకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్, టి.కృష్ణారావు, రెడ్‌క్రాస్ మేనేజర్, బిఎస్.ప్రసాద్, ప్రముఖవైద్యులు డాక్టర్ నక్కా.రేవంత్, డాక్టర్ రమ్య, డాక్టర్ భారతి, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పద్మావతి రవిప్రకాష్‌ను సత్కరిస్తున్న ఆర్.టి.సి. అధికారులు

డ్రగ్స్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-కోవూరు : జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మంగళవారం బిటెక్ విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ డిఎస్‌పి వీరాంజనేయ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వత్తి విద్య కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం ఎక్కువగా ఉందని, ముఖ్యంగా విజయనగరం, ఒరిస్సా సరిహద్దుల్లో గంజాయి రవాణా ఎక్కువగా జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండి మానసిక శరీరక ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం కోవూరు సిఐ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం ఒక మానసిక వ్యసనమని మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కేవలం కృత్రిమమైన ఆనందం లభిస్తుందన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి సుబ్బారావు, ఎస్ ఐ వెంకటేశ్వర రావు, వై విజయ శంకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల యువత బతుకులు చిద్రం అవుతాయని ఎస్ఇబి సిఐ ఎం.బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని ముదివర్తిపాలెం, కొమరిక గ్రామాలలో మంగళవారం ఆయన విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రార్థన చేయించారు. ముదివర్తి పాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానంద రావు, మహిళా పోలీస్ అర్షియా, ఎస్ఇబి సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.